RNI NO.TELTEL/2022/83842

# ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

వరంగల్ | సంచిక 310 | సంపుటి 4 | ఆదివారం | 16-08-2026 | పేజీలు 4 | వెల 3/-

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374

# అభివృద్ధి దిశగా తెలంగాణ పయనం

- కీలక బాధ్యతగా ఉద్యోగ నియామకాలు..
- ఇప్పటికే 72 వేల ఉద్యోగాల భర్తీ ..
- గ్రూప్ పరీక్షలను సమర్థంగా నిర్వహించాం
- త్వరలోనే ఇంటర్‌నేషనల్ స్పోర్ట్స్ నిర్వహణ..
- ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచాం
- తెలంగాణ రైజింగ్-2047' దిశగా అడుగులు వేస్తున్నాం
- గోల్కొండ కోట నుంచి ప్రజలనుద్దేశించి సీఎం రేవంత్ ప్రసంగం



హైదరాబాద్, ప్రభాతగమనం, ఆగస్ట్ 15:

ఉద్యోగ నియామకాలను ప్రభుత్వం అత్యంత కీలక బాధ్యతగా తీసుకుందని, ఇప్పటి వరకు 72 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను పూర్తి చేశామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. గ్రూప్1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4, మెగా డీఎస్సీ నియామకాలను విజయవంతంగా నిర్వహించి నియామక పత్రాలు అందించామని తెలిపారు. యువతకు నైపుణ్యం, ఉద్యోగాలు కల్పించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా ఐటీఐలు, పాలిటెక్నిక్ కళాశాలలను అప్‌గ్రేడ్ చేస్తున్నామని వివరించారు. గచ్చిబౌలి స్పోర్ట్స్ అకాడ, యంగ్ ఇండియా డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ స్కిల్లింగ్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని, త్వరలోనే తెలంగాణ వేదికగా యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ 2026 నిర్వహించ బోతున్నామని చెప్పారు. గోల్కొండకోటలో త్రివర్ణ పతాకం ఎగురవేసిన సిఎం ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. వైద్యరంగంలో ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని, నిమ్స్‌లో 2,000 పడకల నూతన ఆసుపత్రి నిర్మాణంతో పాటు వరంగల్, సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మిస్తున్నామని తెలిపారు. కొత్తగా 8 మెడికల్ కళాశాలలు, 16 నర్సింగ్ కళాశాలలు, 28 పారామెడికల్ కళాశాలలను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. దక్షిణ భారతదేశంలోనే తొలి కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ సెంటర్ నిర్వహణ ఇందుకు నిదర్శనమని, ఇప్పటి వరకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 5.18 లక్షల మందికి రూ.2,526 కోట్ల సాయం అందించామని వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో తెలంగాణ పోలీసులకు సరికొత్త సాంకేతికత, వనరులను అందిస్తున్నామని సీఎం చెప్పారు. సైబర్ నేరాలు, ఆహార కల్తీని ఎదుర్కొనేందుకు డ్రగ్స్ కంట్రోల్, సైబర్, ఆహార కల్తీ నియంత్రణ లను ఒకే గొడుగు కిందకు తీసుకువస్తున్నామని తెలిపారు. ఓఆర్ఆర్‌పై ప్రమాదాలు తగ్గించేందుకు హైవే ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సెంటర్లు, మహిళల భద్రతకు షీ టీమ్స్, పిల్లల అనుకూల న్యాయస్థానాల ఏర్పాటులో తెలంగాణ ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఉద్యోగుల సంక్షేమం పట్ల శ్రద్ధతో నిర్ణయాలు తీసుకుంటున్నా మని, పీఆర్‌సీ, పెన్షన్లు, ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ వంటివి అమలు చేస్తున్నామని తెలిపారు. 36 సచివాలయ శాఖల్లో 100 శాతం ఈ-ఆఫీస్ అమలు చేశామని, ఈ నెల 17వ తేదీ నుండి అన్ని ఎంపీడీవో కార్యాలయాల్లో 'ప్రజావాణి' ప్రారంభిస్తున్నామని ప్రకటించారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో రెండో దశ, మూసీ పునరుజ్జీవనం, చెరువుల పరిరక్షణకు 'హైడ్రా' ఏర్పాటు వంటి చర్యలు చేపడుతున్నామని సీఎం వివరించారు. పారిశ్రామికంగా టి-ఐడియా ద్వారా రూ.1.29 లక్షల కోట్ల పెట్టుబడులు, తెలంగాణ గ్లోబల్ ఏఐ సమ్మిట్ ద్వారా రూ.5.75 లక్షల కోట్ల ఒప్పందాలు సాధించామని, 2025-26లో ఐటీ ఎగుమతులు రూ.3.97 లక్షల కోట్లకు చేరాయని వెల్లడించారు. తొలి సమగ్ర టూరిజం పాలసీ 2025 తీసుకువచ్చామని, సమ్మక్క సారలమ్మ జాతర అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను మార్చాలనే సంకల్పంతో 'తెలంగాణ రైజింగ్-2047' దిశగా అడుగులు వేస్తున్నామని, అందరి సహకారంతో రాష్ట్ర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తామని సీఎం ప్రసంగాన్ని ముగించారు.







# భారత్‌కు ప్రపంచస్థాయి నాయకత్వ లక్షణం

- సత్తా చాటగల నైపుణ్యాలు మన సొంతం
- యువత ఓ గంట సమయం కేటాయిస్తే చాలు
- జనగణనలో ఖచ్చితమైన సమాచారం ఇవ్వండి
- దానితోనే దేశ అభివృద్ధి ప్రణాళికలు రచించగలం
- ఎర్రకోట నుంచి ప్రధాని మోదీ పిలుపు
- వేడుకలకు దూరంగా రాహుల్, ఖర్గే

న్యూఢిల్లీ, ప్రభాతగమనం, ఆగస్ట్15:

భారత్‌కు ప్రపంచస్థాయి నాయకత్వ లక్షణాలు ఉన్నాయని, అన్ని రంగాల్లో దూసుకుపోయే సమర్థత ఉందని ప్రధాని మోదీ అన్నారు. సవాళ్లు స్వీకరించి ముందుకు సాగడం ద్వారా మనమేంటో సత్తా చూడగలమన్నారు. ఎర్రకోట వేదికగా ప్రధాని మోదీ యువత లక్ష్యంగా పలు కార్యక్రమాలను ప్రకటించారు. కోటి మంది యువతకు ఏఐ నైపుణ్యాలలో శిక్షణ ఇస్తామని, పోటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందిస్తామన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఉన్న ఆర్థిక భారా న్ని తగ్గించడమే.. ఉచిత కోచింగ్ కార్యక్రమ లక్ష్యమని చెప్పా రు. అలాగే ప్రస్తుతం దేశంలో జరుగుతోన్న జనగణన గురించి ప్రస్తావించారు. దానిలో యువత చురుగ్గా పాల్గొనాలని మోదీ పిలుపునిచ్చారు. 'నేను అందరినీ ఒక ఫేవర్ చేయాలని అడుగుతున్నాను. ఒక గంటా, రెండు గంటల సమయం కేటాయించండి. అది దేశానికి ఎంతో ఉపయోగపడుతుంది. ఆ మాత్రం సమయం దేశాన్ని ఎలా బలోపేతం చేస్తుందా..? అని యువత ఆలోచిస్తూ ఉండొచ్చు. వారి భాగస్వామ్యంతో ప్రతి ఇంట్లో జనాభా గణనకు ఒక అనుకూల వాతావరణం ఏర్పడేందుకు అవకాశం ఉంటుంది. గణన అంటే లెక్కలన్నీ ఒక దగ్గర రాసుకోవడం కాదు. జనాభా లెక్కల సమయంలో ప్రజలు ఇచ్చే వివరాల ఆధారంగానే జాతీయ విధానాలు, పథకాలు రూపుదిద్దుకుంటాయి. దేశ ప్రగతికి ఆ లెక్కలు సూచీగా ఉంటాయి. అందుకే కచ్చితమైన, స్పష్టమైన సమాచారం ఇవ్వడం అత్యంత కీలకం అని మోదీ పేర్కొన్నారు. అలాగే 'దిమాగీ నక్సల్స్' గురించి మాట్లాడుతూ.. వారిని దేశానికి కొత్త శత్రువులుగా అభివర్ణించారు. 'సంవత్సరాలుగా మావోయిస్టు భావజాలం ఉన్న వ్యక్తులు దేశంలో బలంగా పాతుకుపోయారు. అడవుల్లోని సాయుధ నక్సల్స్‌ను నిర్మూలించి, ఆ సంక్షోభం నుంచి దేశాన్ని విముక్తి చేయడంలో ప్రభుత్వం విజయం సాధించింది. మహిళా కోటా బిల్లుపై ప్రతిష్టంభన నెలకొన్న నేపథ్యంలో.. తన ప్రసంగంలో దాని ప్రస్తావన తీసుకువచ్చారు. ప్రతి పక్షాలు విభేదాలను పక్కనపెట్టి.. పార్లమెంట్, శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు సహకరించాలని కోరారు. క్రెడిట్ వారే తీసుకున్నా ఫర్వాలేదని, కానీ బిల్లు పాసయి మహిళలకు గౌరవం దక్కాలన్నదే తన ఆకాంక్ష అన్నారు. భారత్ ఇకపై చిన్న కలలతో ముందుకు వెళ్లలేదని, ఆలోచనా పరిధి విస్తృతం చేసుకునేందుకు ఉన్నత లక్ష్యాలు అవసరమని మోదీ పిలుపునిచ్చారు. భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారినప్పుడు ప్రపంచం మన వైపు చూసే తీరే మారుతుందని పేర్కొన్నారు. ఇతర దేశాలపై ఆధారడి జీవించలేమని, స్వయం సమృద్ధి సాధించాలన్నారు. టెక్ ప్రపంచంలో చిప్‌ల విలువను భారతదేశం అర్థం చేసుకుంటోందని, అందుకే మూడు సెకండక్టర్ ప్లాంట్లను ఏర్పాటు చేసిందని తెలిపారు. సప భవిష్యత్తులో మరిన్ని సెకండక్టర్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇప్పుడు ప్రతిభారతీయుడు స్థానిక ఉత్పత్తులకు మద్దతు ఇవ్వడంపై సంతోషం వ్యక్తంచేశారు. తమ ప్రభుత్వ హయాంలో 25 కోట్లమంది పేదరికం నుంచి బయటపడ్డారని తెలిపారు. అభివృద్ధి దిశగా దృఢ సంకల్పంతో పయనిస్తోన్న 140 కోట్ల మంది భారతీయులను ఆప డం అసాధ్యం అని పేర్కొన్నారు. దేశంలో 70 నగరాల్లో పైప్‌లైన్ ద్వారా గ్యాస్ అందిస్తున్నాం. 1.75 కోట్ల ఇళ్లకు పైప్ ద్వారా వంటగ్యాస్ సరఫరా చేస్తున్నాం. ఇంధన భద్రత సాధించడం దేశ తక్షణ అవసరం. వంద గిగావాట్ల అణు ఇంధనం సాధించడం మన లక్ష్యం అన్నారు. ఇటవలే హైడ్రోజన్ రైలును విజయంతంగా నడిపించాం. 90 ఏళ్లలో 30 శాతం మాత్రమే రైళ్ల ఎలక్ట్రిఫికేషన్ జరిగింది. 10 ఏళ్లలో 70 శాతం రైళ్ల ఎలక్ట్రిఫికేషన్ పూర్తి చేశాం. ఇటీవలే హైడ్రోజన్ రైలును విజయవంతంగా నడిపించామని అన్నారు. 50 లక్షల ఇళ్లకు సౌరశక్తి విద్యుత్ అందిస్తున్నాం. దేశంలో ఐదు న్యూక్లియర్ రియాక్టర్లు ఏర్పాటు చేస్తున్నామని మోదీ తెలిపారు. అయితే స్వాతంత్య వేడుకల్లో ఈ సారి కూడా లోక్‌సభ, రాజ్యసభల్లో విపక్ష నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే హాజరుకాలేదు. సీటింగ్, ఇతర ప్రొటోకాల్స్ వారి పదవులకు అనుగుణంగా ఉండటం లేదని కాంగ్రెస్ గతంలో ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వారు రెండోసారి గైర్హాజరయ్యారు.

P-02_Layout 2 16-Aug-26 01:27 AM Page 1



# గోల్కొండ కోటలో ఘనంగా పంద్రాగస్టు వేడుకలు

- జాతీయ జెండాను ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి
- ప్రజా పాలనలో ఎన్నో సాధించుకున్నాం

హైదరాబాద్ ఆగస్టు 15(ప్రభాత గమనం):



"గడిచిన రెండున్నరేండ్ల ప్రజా పాలనలో తెలంగాణ పునర్నిర్మాణానికి బలమైన పునాదులు వేశాం. భవిష్యత్తు తెలంగాణ నిర్మాణాన్ని మరింత వేగంగా ముందుకు తీసుకెళ్తాం. ఈ రెండున్నరేండ్లలో ప్రజా ప్రభుత్వం సాధించిన ప్రతి విజయంలో ప్రజలు, ఉద్యోగుల భాగస్వామ్యం ఉంది. ఇక ముందు కూడా భగవంతుడి ఆశీస్సులు, మీ అందరి సహకారంతో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసుకుందాం. తెలంగాణను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుదాం" అని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పిలుపునిచ్చారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి గోల్కొండ కోటలో జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. నిరుపేదల ఆర్థిక పురోగతికి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు ఒక స్పష్టమైన దార్శనికతతో విధ్వంసమైన తెలంగాణను పకడ్బంధీ ప్రణాళికలతో వికాసంవైపు నడిపించడానికి తీసుకున్న కార్యక్రమాలను ముఖ్యమంత్రి తన సందేశంలో సమగ్రంగా వివరించారు. "గడిచిన 32 నెలల్లో ప్రజా ప్రభుత్వం సంక్షేమంతో నాలుగు కోట్ల ప్రజలకు భరోసా ఇచ్చింది. అన్ని రంగాల్లో అభివృద్ధిని వేగవంతం చేసింది. సామాజిక న్యాయంలో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించింది. భవిష్యత్తు ఆర్థిక వ్యవస్థకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సాంకేతికత, నైపుణ్యాలపై బలమైన పునాదులు వేసింది. సాధించిన విజయాల పునాదిపై తెలంగాణను మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లే బృహత్తర సంకల్పమే తెలంగాణ రైజింగ్-2047.ఈ 32 నెలల కృషి ఇప్పుడు ఫలితాల్లో కనిపిస్తోంది. ఆర్‌బీఐ తాజా గణాంకాల ప్రకారం 2025-26లో మన రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 4,18,931. దేశ తలసరి ఆదాయంతో పోలిస్తే తెలంగాణ తలసరి ఆదాయం దాదాపు 91 శాతం అధికంగా ఉంది. మన ఆర్థిక వ్యవస్థ బలాన్ని చాటిచెప్పే గొప్ప విజయం ఇది.మా ప్రభుత్వంలో సంక్షేమాన్ని ఆర్థిక కోణంలోనో, ఖర్చు పెట్టిన రూపాయలతోనో లెక్క కట్టడం లేదు. మా సంక్షేమ ఆలోచనలో మానవీయత ఉంది. పేదవాడి పట్ల బాధ్యత ఉంది. వారి జీవితాల్లో ఆనందం నింపాలన్న తపన ఉంది. వారికి ఆరోగ్యవంతమైన జీవితాలను అందించే ప్రయత్నం ఉంది. ఆత్మగౌరవంతో కూడిన జీవన విధానాన్ని అందించే సంకల్పం ఉంది. ప్రతి పథకంలో శాస్త్రీయ దృక్పథం ఉంది.రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది అని మా ప్రభుత్వం గట్టిగా నమ్ముతుంది. రైతుల కష్టాలు తీర్చి వ్యవసాయాన్ని పండగ చేయాలనే ఆలోచనతో ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమానికి ఎక్కువ ప్రాధాన్యత నిచ్చింది. వరి సాగు విస్తీర్ణం, దిగుబడిలో మన తెలంగాణ పంజాబ్‌ను దాటేసింది. దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది.కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన న్యాయమైన వాటా సాధించే విషయంలో రాజీపడేది లేదు. అటు తుమ్మడిహెట్టి నుంచి ఇటు పాలమూరు వరకు పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యక్రమంలో పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుంది.తెలంగాణలో కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు వెళుతోంది. సంక్షేమ పథకాల్లో సన్నబియ్యం ఓ విప్లవాత్మక పథకం. మనిషిని మనిషిగా గుర్తించి, ఆరోగ్యానికి భరోసా ఇచ్చే పథకం. సన్నబియ్యంతో బువ్వ తినడం మా హక్కు అని నమ్మకం కలిగించిన పథకం. 93 లక్షలకు పైగా కుటుంబాలు, దాదాపు 3.38 కోట్ల మంది ప్రజలను ప్రజా పంపిణీ వ్యవస్థ పరిధిలోకి తీసుకొచ్చాం. ఎన్నో ఏళ్లుగా కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురు చూసిన కుటుంబాలకు ప్రజా ప్రభుత్వం భరోసా ఇచ్చింది.15 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులు జారీ చేశాం. రాష్ట్రవ్యాప్తంగా ఈరోజు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభిస్తున్నాం. కొత్త సాంకేతికతతో రేషన్ పంపిణీలో పారదర్శకతను, జవాబుదారీతనాన్ని పెంచుతున్నాం.పేదల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నాం. తొలి దశలో4.50 లక్షల ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. రాష్ట్రంలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, చేనేత కార్మికులు 43 లక్షల మందికి సామాజిక భద్రతా పింఛన్లు అందిస్తున్నాం.పన్నెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న కనీస వేతనాల సవరణను ప్రజా ప్రభుత్వం ఆమోదించింది. సుమారు కోటి 11 లక్షల మంది కార్మికులకు ప్రయోజనం కల్పించాం. దేశంలోనే ఆదర్శవంతంగా గిగ్ కార్మికుల సంక్షేమ చట్టం అమల్లోకి తెచ్చాం. విద్యారంగంలో ప్రజా ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు స్పష్టమైన ఫలితాలు ఇస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రకటించే పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో తెలంగాణ 28వ స్థానం నుంచి 18వ స్థానానికి చేరుకుంది.తెలంగాణ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడాన్ని ప్రజా ప్రభుత్వం అత్యంత కీలక బాధ్యతగా తీసుకుంది. ఇప్పటి వరకు ప్రభుత్వశాఖల్లో 72 వేలకుపైగా ఉద్యోగ నియామకాలను పూర్తి చేశాం. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4, మెగా డీఎస్సీ నియామకాలు విజయవంతంగా నిర్వహించాం.నోటిఫికేషన్ ఇచ్చి ఆగిపోకుండా పరీక్షలు, ఫలితాలు, ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి అభ్యర్థులకు నియామక పత్రాలు అందించాం. టీజీపీఎస్‌సి ద్వారా 456 వివిధ పోస్టులు, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా 7437 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చాం.ప్రభుత్వ వైద్యరంగాన్ని బలోపేతం చేసే దిశగా ప్రజా ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది. గోషామహల్‌లో రెండువేల పడకల నూతన ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టాం. వరంగల్ లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రితో పాటు సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్‌లో మూడు టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను సిద్ధం చేస్తున్నాం. 9 కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రారంభించాం. 8 మెడికల్ కాలేజీలకు కొత్త భవనాలను నిర్మిస్తున్నాం. కొత్తగా 16 నర్సింగ్ కాలేజీలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు 28 పారా మెడికల్ కాలేజీలు ప్రారంభించాం.డ్రగ్స్, ఆహార కల్తీపై ఉక్కుపాదం మోపుతున్నాం. డ్రగ్స్ ముప్పు, ఆహార కల్తీని ఎదుర్కొనేందుకు కొత్తగా టీజీ సేఫ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాం. టీజీ సేఫ్ ఆహార కల్తీ నియంత్రణ, డ్రగ్స్ నియంత్రణను ఒకే గొడుగు కిందకు తీసుకొస్తున్నాం. ప్రత్యేక లీగల్, ల్యాబొరేటరీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల సమన్వయంతో విస్తృత తనిఖీలు చేసి కల్తీ నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటాం.ప్రజా ప్రభుత్వ విజయాల్లో ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు కీలక భాగస్వాములు. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచడం నుంచి సంక్షేమ పథకాలను చివరి లబ్ధిదారుడికి చేర్చడం వరకు... పెట్టుబడులను ఆకర్షించడం నుంచి అన్ని రంగాల్లో ప్రభుత్వ సేవలను విస్తరించడం వరకు ఉద్యోగులు, అధికారులు సహకారం కీలకం.ప్రజల సమస్యలకు మండల స్థాయిలోనే పరిష్కరించడానికి ఈ నెల 17వ తేదీ నుంచి రాష్ట్రంలోని అన్ని ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాం. ప్రతి సోమవారం ఈ కార్యక్రమం నిర్వహిస్తాం. దీనికి సంబంధించి త్వరలోనే ప్రజావాణి ఆన్ లైన్ పోర్టల్ ను ప్రారంభించి ఎక్కడినుంచైనా అర్జీలు నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తాం. తెలంగాణ పోటీ ఇతర రాష్ట్రాలతో కాదు. తెలంగాణ ప్రపంచంతో పోటీ పడుతోంది. అందుకే ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలను నిర్మించేందుకు కార్యాచరణ మొదలు పెట్టాం. ప్రజా పాలనలో జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలకు తెలంగాణపై నమ్మకం పెరిగింది.బిజినెస్ రిఫార్మ్స్ యాక్షన్ ప్లాన్‌లో బిజినెస్ ఎంట్రీ, కన్‌స్ట్రక్షన్ పర్మిట్ ఎనేబ్లర్స్, సర్వీస్ సెక్టార్, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ విభాగాల్లో తెలంగాణ టాప్ అచీవర్‌గా నిలవడమే ఇందుకు నిదర్శనం. ఈ ఏడాది కూడా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించి తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రపంచానికి చాటిచెబుతాం.ఐటీ రంగంలో తెలంగాణ దూసుకెళుతోంది. 2025-26లో తెలంగాణ ఐటీ ఎగుమతులు రూ.3.97 లక్షల కోట్లకు చేరాయి. ప్రత్యక్ష ఐటీ ఉద్యోగాలు 12.14 లక్షలకు పెరిగాయి. హైదరాబాద్‌లో ఇప్పుడు 355కి పైగా గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు పని చేస్తున్నాయి. 2026లో కొత్తగా 40 గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు హైదరాబాద్‌కు వచ్చాయి.డేటా సెంటర్లు, క్లౌడ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో తెలంగాణ దేశంలో అత్యంత వేగంగా ఎదుగుతున్న గమ్యస్థానాల్లో ఒకటిగా మారింది. అమెజాన్ కంపెనీ తెలంగాణలో అదనంగా 7 బిలియన్ డాలర్ల పెట్టుబడి ప్రకటించింది. భారత్ ఫ్యూచర్ సిటీ, చందన్‌వెల్లి ప్రాంతాల్లో దేశంలోని అతిపెద్ద హైపర్‌స్కేల్, ఏఐ-రెడీ క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ క్యాంపస్‌లలో ఒకటి రూపుదిద్దుకుంటోంది.భారత్ ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు హైదరాబాద్ ముఖచిత్రాన్ని మార్చబోతున్నాయి. ఫ్యూచర్ సిటీ కోసం భూములిచ్చిన రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటాం. మూసీ పరీవాహక ప్రాంత ప్రజలు పెద్దమనసులో అర్థం చేసుకోవాలి. ఈ విషయంలో ఎవరికీ ఎలాంటి నష్టం, కష్టం రానివ్వం.ఒకవైపు సంక్షేమం మరోవైపు అభివృద్ధి సాధించాలన్న సంకల్పంతో ముందుకు వెళుతున్నాం. దైవం ఆశీస్సులతో పాటు మీ అందరి ఆశీస్సులు తోడైతే మరిన్ని విజయాలు సాధిస్తాం.." అని ముఖ్యమంత్రి తెలిపారు.



## వికసిత్ భారత్ కోసం అందరూ పనిచేయాలి

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము...

న్యూఢిల్లీ ఆగస్టు 15(ప్రభాత గమనం):

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం జాతినుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు. వికసిత్ భారత్ కోసం అందరూ పనిచేయాలని ఆమె కోరారు. జ్యోతిబా పూలే బడుగుల అభ్యున్నతి కోసం కృషి చేశారని కొనియాడారు. పూలే దంపతులు స్త్రీ విద్య, మహిళల సాధికారత కోసం పాటుపడ్డారని గుర్తు చేశారు..

## మృతురాలి కుటుంబాని లక్ష్మణ్ బాబు పరామర్శ..

ములుగు ఆగస్టు 15(ప్రభాత గమనం):

ములుగు మండలం పాల్సపల్లి గ్రామానికి చెందిన జర్పుల సుగుణ అకాల మరణం పట్ల బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మల్లంపల్లి మండల అధ్యక్షులు పాలెం శ్రీనివాస్, బిఆర్ఎస్ నాయకులు, పోరిక గోవింద నాయక్, తుమ్మ మాల్లారెడ్డి, తాటి కృష్ణ, భూక్య జంపన్న, వెంకన్న, ఎండి వలీ బాబా, కర్ర రవీందర్, చిట్టి మల్ల సమ్మయ్య, కోకిల మహేష్, ఎస్.కె కురుబాని, , చీదర సంతోష్, ఆకుల మల్లేష్, చోటు మొహమ్మద్, మొర్రి రాజుయాదవ్, బావగారి లింబాద్రి శర్మ, కుక్కల సంపత్, బతోజు ద్రోణా చారి, చిట్టి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మంద కొమ్మలు, కందువుల సాంబయ్య, విజయ పాల్ రెడ్డి, రాజమౌళి, వేములపల్లి అశోక్, చాంద్ పాషా, బానోత్ సోముల, పాడియా సుమన్, గాయం ఇంద్రారెడ్డి, ఓరుగంటి ప్రవీణ్, దొంతి రాంరెడ్డి, రామల్, రమేష్, వీరు నాయక్, రవి, గున్నాల యాకూబ్ రెడ్డి, తిరుప, అనిల్, రూప్ సింగ్ పాల్గొన్నారు.



## గోల్కొండ కోటలో త్రివర్ణ పతాక రెపరెపలు

- తొలిసారి పూర్తిస్థాయి వందేమాతర గీతాలాపన
- పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన సీఎం



హైదరాబాద్, ప్రజాతంత్ర, ఆగస్ట్15: గోల్కొండ కోటలో 80వ స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఇక, గోల్కొండ కోటపై తొలిసారిగా 'వందేమాతరం' గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా కోట ప్రాంగణం దేశభక్తి నినాదాలతో మార్మోగింది. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రజలందరికీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. అసమానతలు లేని శాంతియుత, సౌభ్రాతృత్వ భారతదేశాన్ని నిర్మించాలని తెలిపారు. సమరయోధుల త్యాగాలకు అదే నిజమైన నివాళి అని సీఎం వ్యాఖ్యానించారు. సమన్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వంతో 80వ స్వాతంత్య దినోత్సవం జరుపుకోవాలని ఆకాంక్షించారు. నవ భారత నిర్మాణంలో ప్రతి పౌరుడు కర్తవ్యనిష్టతో ముందుకు సాగాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.



## మణుగూరు తహసీల్దార్ అద్దంకి నరేష్‌కు సేవా పురస్కారం

భద్రాద్రి కొత్తగూడెం, ప్రభాత గమనం:

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మణుగూరు తహసీల్దార్, కార్యనిర్వాహక మేజిస్ట్రేట్ అద్దంకి నరేష్‌కు అత్యుత్తమ సేవలకు గుర్తింపుగా సేవా పురస్కారం అందించారు. రెవెన్యూ పరిపాలనతో పాటు ప్రజాసేవలో ఆయన చూపుతున్న నిబద్ధత, అంకితభావాన్ని గుర్తిస్తూ సేవా విశిష్టత విభాగంలో ప్రశంసా పత్రాన్ని అందజేశారు. భద్రాచలం ఉప కలెక్టర్, ఉప విభాగ మేజిస్ట్రేట్ మృణాల్ శ్రేష్ఠ చేతుల మీదుగా అద్దంకి నరేష్ ఈ పురస్కారాన్ని స్వీకరించారు. ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందించడంతో పాటు విధుల పట్ల నిబద్ధతతో పనిచేస్తున్నందుకు ఈ గుర్తింపు లభించిందని అధికారులు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సేవా పురస్కారం అందుకోవడంపై రెవెన్యూ అధికారులు, సిబ్బంది అద్దంకి నరేష్‌ను అభినందించారు.



## ఎర్రకోటపై జెండా ఎగరేసిన ప్రధాని మోదీ

- వరుసగా 13వసారి జెండా ఆవిష్కరణ
- తొలిసారిగా పూర్తిస్థాయి వందేమాతర గీతాలపన
- పూలవర్షం కురిపించిన వాయుసేన హెలికాప్టర్లు

న్యూఢిల్లీ,ఆగస్ట్15: దేశవ్యాప్తంగా 80వ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రాజధాని ఢిల్లీలో ఎర్రకోటపై ప్రధాని మోదీ జాతీయ జెండా ఎగురవేశారు. ఢిల్లీలోని ఎర్రకోటపై మోదీ వరుసగా 13వ సారి జాతీయ జెండా ఎగురవేశారు. దేశ చరిత్రలో తొలిసారిగా వందేమాతరం గేయాన్ని పూర్తిగా ఈ వేడుకల్లో ఆలపించారు. అనంతరం జాతీయ గీతం 'జనగణమన'ను ఆలపించారు. ఆ సమయంలో వాయుసేన పూలవర్షం కురిపించింది. ఒక హెలికాప్టర్ జాతీయ పతాకాన్ని.. మరొకటి 'వందేమాతరం' అని రాసి ఉన్న జెండాను మోసుకెళ్లాయి. 'వందేమాతరం' గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గతేడాది నవంబర్ 7 నుంచి ఏడాది పాటు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే జాతీయ గీతం 'జన గణ మన'తో పాటు వందేమాతరానికి ప్రభుత్వం సమాన హోదా కల్పిస్తూ చట్టం చేసింది. ఈ చట్టం ప్రకారం.. 'వందేమాతరం'ని అవమానించినా, ఆలపిస్తున్న సమయంలో ఆటంకం కలిగించినా ఇకపై చట్టరీత్యా నేరంగా పరిగణిస్తారు. స్వాతంత్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రముఖ సెర్చ్ ఇంజిన్ సంస్థ గూగుల్ ప్రత్యేక డూడుల్‌ను రూపొందించింది. ఇది భారతీయ వస్త్ర కళలు, సంస్కృతీ సంప్రదాయాలు, వైవిధ్యాన్ని చాటిచెబుతోంది. 22 విభిన్న ప్రాంతీయ వస్త్ర సంప్రదాయాలను తెలియజేసే డిజైన్‌లు అందులో కనిపిస్తున్నాయి. చేతితో నేసిన ఈ వస్త్రాల డూడుల్ దేశవ్యాప్తంగా ఉన్న నేత కార్మికులు, రైతులు, బ్లాక్-ప్రింటర్ల సామూహిక శ్రమను ప్రతిబింబిస్తోంది. జెండా ఎగురవేయడానికి ముందు ప్రధాని మోదీ రాజ్‌ఘాట్ వద్ద మహాత్ముడికి నివాళులు అర్పించారు. అనంతరం ఎర్రకోట వద్ద గౌరవవందనం స్వీకరించి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ వేడుకలు ప్రారంభమైన సమయంలో వాయుసేన పూలవర్షం కురిపించింది. స్వాతంత్ర్య దినోత్సవం రోజున మోదీ జెండా ఎగురవేయడం ఇది 13వసారి కావడం విశేషం. జెండా ఎగురవేసిన అనంతరం ఆయన దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. 'ఈ రోజు మనమంతా 80వ స్వాతంత్య దినోత్సవాన్ని జరుపుకొంటున్నాం. ప్రతి హృదయంలో 'వందేమాతరం' ధ్వనిస్తోంది. ప్రతి ఇంట్లో త్రివర్ణ పతాకం రెపరెపలాడుతోంది. కొత్త తీర్మానాలతో సరి కొత్త ఉత్సాహంతో దేశం ముందుకు సాగుతోంది. గతంలో ఐదు బల హీన దేశాల జాబితాలో ఉన్న భారత్.. 12 ఏళ్ల తర్వాత ఇప్పుడు వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థిక వ్యవస్థగా మారింది' అని మోదీ అన్నారు.

ప్రభాత గమనం

వరంగల్, ఆదివారం, 16-08-2026

# 'సీతారామ' కాలువ పనుల్లో జాప్యం వద్దు

- భూసేకరణను వేగవంతం చేసి పనులు పూర్తి చేయాలి
- నెలాఖరులోగా ఎత్తిపోతల ద్వారా నీటి విడుదలకు చర్యలు
- వచ్చే ఏడాది జూన్ నాటికి మూడు లక్షల ఎకరాలకు సాగునీరు
- మారెళ్లపాడు ఎత్తిపోతల పనులను వేగవంతం చేయాలి
- రైతులకు న్యాయమైన నష్టపరిహారం చెల్లిస్తాం: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



భద్రాద్రి కొత్తగూడెం, ప్రభాత గమనం :

సీతారామ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కాలువల పనుల్లో ఇక ఎలాంటి జాప్యం లేకుండా భూసేకరణను వేగవంతం చేసి పనులను పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శనివారం అశ్వాపురం మండలం బిజీ కొత్తూరు వద్ద సీతారామ ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్‌ను పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ తో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా డిస్ట్రిబ్యూటరీ కాలువలకు సంబంధించిన భూసేకరణ, పైప్‌లైన్ పనులు, ఇతర నిర్మాణ పనుల పురోగతిని ఇరిగేషన్ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీతారామ ఎత్తిపోతల పథకం పంపును ఆన్ చేసి నీటిని దిగువకు విడుదల చేశారు. సీతారామ ప్రాజెక్టును పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చి రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణానికి అవసరమైన భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని, సేకరించిన భూములను రైతులు వెంటనే సంబంధిత అధికారులకు అప్పగించేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. భూములు అప్పగించిన వెంటనే రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో భూసేకరణకు అవసరమైన నష్టపరిహారాన్ని చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి తెలిపారు. రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, ప్రాజెక్టు నిర్మాణానికి రైతులు సహకరించాలని కోరారు. పైప్‌లైన్ ఏర్పాటు చేసిన భూముల్లో పనులు పూర్తయిన అనంతరం రైతులు భూమి పైభాగంలో తిరిగి వ్యవసాయం చేసుకునే అవకాశం ఉంటుందని మంత్రి తెలిపారు. రైతులకు అవసరమైన నష్టపరిహారం చెల్లిస్తామని స్పష్టం చేశారు. కొంతమంది రైతుల కారణంగా పెద్ద సంఖ్యలో రైతులకు ప్రయోజనం చేకూర్చే ప్రాజెక్టు పనులు నిలిచిపోకూడదని అన్నారు. ఎక్కువ మంది రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా సాగునీటి ప్రాజెక్టు పనులను పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సీతారామ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కాలువల పనులను వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తి చేయడం ద్వారా సుమారు మూడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి తెలిపారు. నాగార్జునసాగర్ ఆయకట్టుకు అదనంగా సీతారామ ప్రాజెక్టు ద్వారా కొత్తగా సుమారు మూడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. ఈ భారీ ప్రాజెక్టు ద్వారా వేలాది మంది రైతులకు ప్రయోజనం కలుగుతుందని, ప్రాజెక్టు ప్రయోజనాలను రైతులకు అందించేందుకు భూసేకరణను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు సమన్వయంతో పనిచేసి భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఈ నెలాఖరులోగా సీతారామ ఎత్తిపోతల పథకం నుంచి నీటిని విడుదల చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇప్పటికే కొంత ఆలస్యం జరిగిందని, ఇకపై ఒక్కరోజు కూడా జాప్యం లేకుండా పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గోదావరిలో ప్రవాహం ఉన్నప్పుడే నీటిని ఎత్తిపోసుకునేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పైప్‌లైన్ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే సమయంలో సీతారామ ప్రాజెక్టు నీరు రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని మంత్రి తెలిపారు. తుమ్మల చెరువు నిండడం ద్వారా సాగునీటి ప్రయోజనాలతో పాటు పర్యాటక అభివృద్ధికి కూడా అవకాశం ఏర్పడుతుందన్నారు. బూర్గంపాడు మండలంలో సుమారు 25 వేల ఎకరాలకు సాగునీరు అందించి సుభిక్షంగా పంటలు పండించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆగస్టు నుంచే ఆరుతడి పంటలకు నీరు అందించే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. పనులు ఇంకా పూర్తి కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి, భూసేకరణతో పాటు నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భూసేకరణకు అవసరమైన నష్టపరిహారాన్ని ప్రభుత్వం చెల్లిస్తుందని రైతులకు వివరించారు. భూసేకరణను వేగవంతం చేసేందుకు రైతులు సహకరించాలని కోరారు. ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి రైతులే కొబ్బరికాయ కొట్టి ప్రారంభించాలని రైతులతో మంత్రి అన్నారు. వందల కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టు పనులు కొంతమంది రైతుల కారణంగా నిలిచిపోవడం సమంజసం కాదని మంత్రి అన్నారు. కొంతమంది కోసం ఎక్కువ మంది రైతులకు కలిగే ప్రయోజనాలను వదులుకోలేమని స్పష్టం చేశారు. రైతులకు నష్టం కలగకుండా నష్టపరిహారం చెల్లిస్తూ భూసేకరణను పూర్తి చేసి, ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి సాగునీటిని అందించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ అధికారులు వ్యవసాయ శాఖ అధికారులు రైతులు ప్రజాప్రతినిధులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మృతి ఘటనలో
# నలుగురు నిందితుల అరెస్టు

భద్రాద్రి కొత్తగూడెం, ప్రభాత గమనం:

బూర్గంపాడు అటవీ జంతువులను వేటాడేందుకు అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేయడంతో విద్యుత్ షాక్‌కు గురై ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బానోతు నవీన్ మృతి చెందిన ఘటనలో నలుగురు నిందితులను బూర్గంపాడు పోలీసు ఎస్ ఐ మెడ ప్రసాద్ అతని బృందం అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆగస్టు 11వ తేదీ రాత్రి నకిరేపేట అటవీ ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు అటవీ జంతువులను వేటాడేందుకు అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేసినట్లు సమాచారం అందింది. దీంతో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బానోతు నవీన్ తన డీఆర్ఓ అనార్కలి, ఇతర సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లారు. నిందితుల కోసం గాలిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తగిలి నవీన్ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు. ఈ ఘటనపై డీఆర్ఓ అనార్కలి ఫిర్యాదు మేరకు బూర్గంపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నవీన్ మృతికి కారణమైన నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు.. శనివారం లక్ష్మి పురం గ్రామంలోని ఆవుల నాగిరెడ్డి ఇంట్లో నిందితులు ఉన్నట్లు సమాచారం అందడంతో అక్కడికి వెళ్లారు. పోలీసులను గమనించిన ముగ్గురు పారిపోతుండగా వారిని పట్టుకున్నారు. వారి సమాచారం ఆధారంగా నాలుగో నిందితుడైన కన్నెదారి అనంతయ్యను నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలోని అతని ఇంటి వద్ద పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో ఆవుల నాగిరెడ్డి (44), దాసరి నరేష్ (35), తాటి వీరబాబు (28), కన్నెదారి అనంతయ్య (58) ఉన్నారు. వీరంతా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందినవారిగా పోలీసులు తెలిపారు. నిందితుల వద్ద నుంచి బైండింగ్ వైరు, కర్రలు పాతేందుకు ఉపయోగించే గడ్డపలుగు, ఖాళీ క్వార్టర్ సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. అటవీ జంతువులను వేటాడేందుకు అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేసి జంతువులతో పాటు మనుషుల ప్రాణాలకు ముప్పు కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. అరెస్టు చేసిన నలుగురు నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించనున్నట్లు తెలిపారు.



# గిరిజన సంస్కృతికి ప్రతీక తీజ్

- క్యాంపు తండా సర్పంచ్ ధరావత్ కైక

కేసముద్రం ఆగస్టు 15(ప్రభాత గమనం): గిరిజన సంస్కృతి సాంప్రదాయాల ప్రతీక తీజ్ పండుగ అని సర్పంచ్ ధరావత్ కైక అన్నారు. మండలంలోని క్యాంపు తండా గ్రామ పంచాయతీ పరిధి రాంసింగ్ తండాలో శనివారం తీజ్ పండగలో పాల్గొని ఆమె మాట్లాడుతూ గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు ప్రకృతి, ఆరాధన,పంటల సమృద్ధి, సుఖ సంతోషాలకు ప్రతీకగా తీజ్ పండుగను నిర్వహిస్తామని వివరించారు సాంప్రదాయ దుస్తువులు ధరించి సాంస్కృతిక కార్యక్రమాలు నృత్యాలతో ఎక్కువ ప్రాధాన్యతతో ఈ పండుగను నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి ధారావత్ రవి నాయక్, బీమా, దేవా, రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.




## ముత్యాలమ్మ గుడిలో
# అన్యమత ఆచారాలకు తావులేదు

- పోలీసుల కఠిన హెచ్చరిక

కేసముద్రం ఆగస్టు 15(ప్రభాత గమనం):

నేడు జరగబోయే కేసముద్రం ముత్యాలమ్మ గుడి బోనాల పండుగలో ఎలాంటి అన్యమత ఆచారాలు (హలాల్) జరగకుండా అడ్డుకట్ట వేసేందుకు "కేసరి ముద్ర హిందూ పరిరక్షణ సమితి" (కేసముద్రం హిందువుల సంఘం) ప్రతినిధులు నేడు కేసముద్రం ఎస్సై ని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వెలిశాల సవీన్, శ్రీనివాస్ రావు గుంజ, ఓర్సు చరణ్, బొద్దుల సతీష్, బొద్దుల సురేందర్, కంచు సురేందర్, గొట్టం లక్ష్మణ్, పింగిలి రాజేంద్రప్రసాద్, వరంగంటి విద్యాసాగర్, రాపాక కుమారస్వామి, రుద్ర శ్రీకాంత్ మరియు బొద్దుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. గత ఏడాది గుడి ఆవరణలో జరిగిన పరిణామాలను ఎస్సై దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన తక్షణమే స్పందించారు. పండుగ సమయంలో ఎవరైనా ఉద్దేశపూర్వకంగా హిందూ సంస్కృతికి మరియు ఆచారాలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే, వారిని ఉపేక్షించేది లేదని, వెంటనే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా మరియు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతల పరిరక్షణ కోసం, నేడు ముత్యాలమ్మ గుడి వద్ద ప్రత్యేకంగా 6 గురు కానిస్టేబుళ్లు మరియు ఒక మహిళా కానిస్టేబుల్‌తో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ.. పోలీసుల సహకారంతో మేమందరం ఎలాంటి ఆందోళన లేకుండా రేపటి బోనాల పండుగను అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకుందామని పిలుపునిచ్చారు.

## శాంతియుత వాతావరణంలో
# బోనాలు జరుపుకోవాలి

- సీఐ సత్యనారాయణ, ఎస్సై క్రాంతి కిరణ్
- ముత్యాలమ్మ బోనాల పండుగ ఏర్పాట్లను పరిశీలించిన పోలీస్ అధికారులు

కేసముద్రం, ఆగస్టు 15(ప్రభాత గమనం):

నేడు కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రంతో పాటుగా మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల్లో జరుగనున్న బోనాల పండుగను శాంతియుత వాతావరణంలో ప్రజలు జరుపుకోవాలనీ సీఐ సత్యనారాయణ, ఎస్సై క్రాంతి కిరణ్ సూచించారు. ఈ నేపథ్యంలో శనివారం బోనాలు నిర్వహించనున్న కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రంలోని ముత్యాలమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ బోనాల పండుగ సందర్భంగా ప్రజలు ఆనందోత్సల మధ్య శాంతి యుతంగా జరుపుకోవాలని సూచించారు. ఎటువంటి అమానియా సంఘటనలు జరుగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు సీఐ వివరించారు. అదేవిదంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలను ఏర్పాటు చేయాలని ప్రజా ప్రతినిధులు, అధికారులకు సూచించారు. ఈకార్యక్రమంలో అల్లం నాగేశ్వర రావు, జాటోత్ హరీష్ నాయక్, వీరు నాయక్, వెంకన్న నాయక్ , దేవేందర్ నాయక్ ,ఆగే రాము, బద్య నాయక్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# 25 ఏళ్లుగా రక్తదానం..

- మానవత్వానికి ప్రతీకగా మహమ్మద్ నయీం

మహబూబాబాద్, ఆగస్టు 15(ప్రభాత గమనం):

దేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వేడుకలతో పాటు సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ, అల్ అన్సార్ యూత్ వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ నయీం గత 25 సంవత్సరాలుగా ప్రతి స్వాతంత్ర్య దినోత్సవం రోజున స్వచ్ఛందంగా రక్తదానం చేస్తూ మానవత్వానికి ప్రతీకగా నిలుస్తున్నారు. రక్తదానాన్ని ఒక సామాజిక బాధ్యతగా భావించిన మహమ్మద్ నయీం, ఏళ్లుగా అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి తన వంతు సహాయాన్ని అందిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది కూడా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రక్తదానం చేయాలని సిద్ధంగా ఉండగా, ఓ అత్యవసర పరిస్థితిలో ఆసుపత్రిలో అవసరమైన రక్తం అందుబాటులో లేదని సమాచారం అందింది. విషయం తెలిసిన వెంటనే ఎలాంటి ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి చేరుకుని రక్తదానం చేసి, అవసరమైన వ్యక్తికి ప్రాణదానంగా నిలిచారు. ఈ సందర్భంగా మహమ్మద్ నయీం మాట్లాడుతూ,డబ్బుతో ఎన్నో వస్తువులను కొనుగోలు చేయవచ్చు. కానీ రక్తాన్ని డబ్బుతో కొనుగోలు చేయలేం. మనిషి మాత్రమే మరో మనిషికి రక్తదానం చేసి ప్రాణాలను కాపాడగలడు. మనం ఇచ్చే రక్తంలోని ప్రతి చుక్క ఒక కుటుంబానికి ఆశను, ఒక ప్రాణానికి భరోసాను అందిస్తుంది" అని అన్నారు. రక్తదానం చేయడం వల్ల ఎలాంటి నష్టం ఉండదని, ఆరోగ్యంగా ఉన్న ప్రతి అర్హత కలిగిన వ్యక్తి క్రమం తప్పకుండా రక్తదానం చేయాలని ఆయన సూచించారు. స్వాతంత్ర్యం అంటే కేవలం దేశం కోసం గర్వించడం మాత్రమే కాదు.. తోటి మనిషి ప్రాణాన్ని కాపాడేందుకు ముందుకు రావడం కూడా దేశసేవలో భాగమే" అనే సందేశాన్ని తన సేవ ద్వారా మహమ్మద్ నయీం చాటిచెప్పారు. 25 ఏళ్లుగా కొనసాగుతున్న ఆయన రక్తదాన సేవలను పలువురు అభినందించారు.

# వెంకటగిరిలో నేడు బోనాలు

కేసముద్రం, ఆగస్టు 15(ప్రభాత గమనం):

కేసముద్రం మండలంలోని వెంకటగిరి గ్రామంలో ఆదివారం ముత్యాలమ్మ బోనాల ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. గ్రామ పెద్దలు, బిఆర్ఎస్ నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి నారాయణ రావు ఆధ్వర్యంలో శనివారం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా గుడి పరిసరాలను పరిశుభ్రం చేయించారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో శ్రావణ్ శర్మతో పాటు వార్డు సభ్యులు సుభాష్,కరుణాకర్, వెంకట్రావు,శ్రీనివాస్ రెడ్డి,రాజు పాల్గొన్నారు.





ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక
వరంగల్, ఆదివారం, 16-08-2026







# ముువ్వన్నెల రెపరెపలు..

## ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- **జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్**

మహబూబాబాద్, ఆగస్టు15(ప్రభాత గమనం):

భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్.టి.ఆర్ గ్రౌండ్స్‌లో శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రాంచంద్రు నాయక్ హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తోందన్నారు.జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా విప్ డాక్టర్ జాటోత్ రాంచంద్రు నాయక్ ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఇతర ప్రజాప్రతినిధులు స్వాతంత్ర్య సమరయోధులను,వారి కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా కె.జి.బి.వి కేసముద్రం, టి.జి.ఎస్.ఆర్.ఎస్, కె.జి.బి.వి చిన్నగూడూరు, ఆనంతారం మోడల్ స్కూల్, జె.ఢ్.హెచ్.ఎస్ గర్ల్స్, ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన దేశభక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, ఉద్యోగులకు విప్ రాంచంద్రునాయక్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, ప్రదానం చేశారు. అంతకుముందు జిల్లా పరిషత్ కార్యాలయంలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రత్యేక అధికారి మరియు జిల్లా కలెక్టర్ డాక్టర్ స్నేహ శబరిష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

**జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో**

80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో జాతీయ జెండా ఆవిష్కరణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీ పోరిక బలరాం నాయక్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీ నాయక్, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్, రెవెన్యూ ఆదనపు కలెక్టర్ కె అనిల్ కుమార్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ పురుషోత్తం, డి.ఆర్ ఓ, నాగవాణి ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



**శ్రీ వివేకవర్ధిని హైస్కూల్లో..**

కేసముద్రం ఆగస్టు 15(ప్రభాత గమనం):

కేసముద్రం మండల కేంద్రంలోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్లో శనివారం కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. దేశ స్వాతంత్ర్యం కోసం మహనీయులు, జాతీయ నాయకులు చేసిన త్యాగాలు, పోరాటాల గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి గీతాలు, నృత్యాలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

**ప్రాథమిక పాఠశాలలో..**

కేసముద్ర మున్సిపాలిటీ పరిధిలో బ్రహ్మంగారి గుడి తండా ఎంపీపీ ఎస్ ప్రాథమిక పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఉపాధ్యాయులు పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు,తల్లిదండ్రులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు చేసిన త్యాగాలు, పోరాటాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని



అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను కొనసాగిస్తూ దేశ అభివృద్ధి, సమగ్ర ప్రగతి కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల ఐక్యత, సమైక్యతతో దేశాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. స్వేచ్ఛా భారతదేశం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. దేశ సమగ్రత, అభివృద్ధి కోసం విద్యార్థులంతా కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయులు శ్రీశైలం సంతోష్ విద్యార్థులు విద్యార్థులు తల్లిదండ్రులు తండావాసులు పాల్గొన్నారు.

**విశ్వశాంతి విద్యాలయంలో..**

గార్ల,ఆగస్టు 15 (ప్రభాత గమనం):

మండల కేంద్రంలోని స్థానిక విశ్వశాంతి విద్యాలయంలో పాఠశాల కరస్పాండెంట్, సొసైటీ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, బీరవెల్లి సంజీవరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరు కాగా పాఠశాల ప్రిన్సిపాల్ పసుపులేటి రమేష్ జాతీయ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. పాఠశాల పూర్వ విద్యార్థి ఖమ్మం పట్టణంలోని ఇండస్ ఆసుపత్రిలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ చాగంటి రాకేష్.. గతేడాది పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. మండల ప్రథమ స్థానం సాధించిన జిల్లా మేఘన, ద్వితీయ స్థానం దక్కించుకున్న తోకల ప్రీతిక, తృతీయ స్థానంలో నిలిచిన ఇస్లావత్ శ్రీ చరిత్‌లకు నగదు బహుమతులు, మెమొంటోలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గార్లలో ఘనంగా వేడుకలు

- **జాతీయ జెండాలను ఆవిష్కరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు**

గార్ల, ఆగస్టు 15 (ప్రభాత గమనం):

గార్ల మండల వ్యాప్తంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం అత్యంత వైభవంగా, పండుగ వాతావరణంలో జరిగాయి. మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు త్రివర్ణ శోభతో ముస్తాబయ్యాయి. ఉదయం నుంచే స్థానిక నాయకులు, అధికారులు జాతీయ జెండాలను ఆవిష్కరించి మువ్వన్నెల పతాకానికి ఘనంగా ప్రణామం అర్పించారు.మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ బానోత్ పార్వతి నాయక్ జాతీయ జెండాను ఎగురవేశారు. పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్స్పెక్టర్ సాయి కుమార్ జెండా ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ దేశి రామ్ నాయక్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శారద, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంలో సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, టీడీపీ కార్యాలయంలో యలమరెడ్డి కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తాళ్లపెల్లి కృష్ణ గౌడ్ జాతీయ జెండాలను ఆవిష్కరించారు.అలాగే, పిఎసిఎస్ కార్యాలయంలో చైర్మన్ దుర్గాప్రసాద్, పశువైద్యశాలలో డాక్టర్ సురేష్ కుమార్, విద్యుత్ శాఖ కార్యాలయంలో మధు, జయశంకర్ విగ్రహం వద్ద లక్ష్మణ్ నాయక్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం సమర్పించారు. వేడుకల్లో ఉప సర్పంచ్ జరీనా బేగం, పంచాయతీ కార్యదర్శి మధు నాయుడు, వార్డు సభ్యులు తోడేటి శ్రీనివాస్, పూర్ణచందర్, సారయ్య, సాయి, ఇమ్రాన్, రావుజీ, భారతి, పంచాయతీ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. రాజకీయ పార్టీల నాయకులు కందునూరి శ్రీనివాస్, అలవాల సత్యవతి (సిపిఎం), గిన్నారపు మురళి, తారక రామారావు (టిజిఎస్), కట్టేబోయిన శ్రీనివాస్, జంపాల వెంకన్న (సిపిఐ) తదితరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



**గార్ల సీపీఎం ఆధ్వర్యంలో ..**

గార్ల మండల కేంద్రంలోని మంగపతి రావు భవనం సిపిఎం కార్యాలయంలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి అలవాల సత్యవతి జాతీయ జెండాను ఆవిష్కరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్ మాట్లాడుతూ... భారత స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టులు పోషించిన పాత్ర ఎంతో గర్వించదగినదని కొనియాడారు. భగత్ సింగ్, హైదర్ అలీ ఖాన్, పుచ్చలపల్లి సుందరయ్య వంటి విప్లవ యోధుల త్యాగాలు ఈ దేశానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. వేడుకల్లో సిపిఎం నాయకులు జి. వీరభద్రం, టి. నాగేశ్వరరావు, పూర్ణచంద్రరావు, బి. శ్రీను, కే. రామకృష్ణ, నాగమణిలతో పాటు బిఆర్ఎస్, టిడిపి మండల అధ్యక్షులు గంగావత్ లక్ష్మణ్ నాయక్, వై. కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# మణుగూరులో జెండావిష్కరించిన ఎమ్మెల్యే పాయం

మణుగూరు,ప్రభాత గమనం :

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు దేశభక్తి, జాతీయ స్ఫూర్తితో ఘనంగా నిర్వహించారు. పినపాక నియోజకవర్గ శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు మణుగూరులోని ఎమ్మెల్యే శిబిర కార్యాలయం, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంతో పాటు పట్టణంలోని పలు ప్రాంతాల్లో జరిగిన వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాలను ఆవిష్కరించారు. మణుగూరు పట్టణంలోని పద్నాలుగు టైర్ల కార్మికుల సంఘం కార్యాలయం, బొగ్గు ముఠా కార్యాలయం, పన్నెండు టైర్ల కార్మికుల సంఘం కార్యాలయం, గుమాస్తాల సంఘం కార్యాలయం, గాంధీ విగ్రహం కేంద్రం తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం జాతీయ గీతాలాపనతో కార్యక్రమాలు కొనసాగాయి. ఈ సందర్భంగా పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు ఎందరో మహనీయులు తమ జీవితాలను త్యాగం చేశారని అన్నారు. వారి త్యాగాలు, పోరాటాల ఫలితంగానే నేడు ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దేశ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశ సమగ్రత, ఐక్యత, సౌభ్రాతృత్వాన్ని కాపాడుతూ ప్రజలందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. స్వాతంత్ర్యం కేవలం వేడుకలకు పరిమితం కాకుండా దేశ అభివృద్ధి కోసం ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించడమే నిజమైన దేశభక్తి అని అన్నారు. యువత విద్య, విజ్ఞానం, క్రమశిక్షణతో ముందుకు సాగుతూ దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. పినపాక నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం తన కృషి నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. మణుగూరు ప్రాంతంలోని కార్మికులు, వ్యాపారులు, రైతులు, మహిళలు, యువత, పేదలు ఐకమత్యంతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబంలో విద్య, ఆరోగ్యం, ఉపాధి, ఆర్థిక అభివృద్ధి సాధించేలా సమాజం కృషి చేయాలని ఆకాంక్షించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పినపాక నియోజకవర్గ ప్రజలకు, తెలంగాణ రాష్ట్ర ప్రజలకు, దేశ ప్రజలందరికీ పాయం వెంకటేశ్వర్లు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దేశం మరింత అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, శాంతి సౌభ్రాతృత్వాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో మండల, పట్టణ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, వివిధ కార్మిక సంఘాల నాయకులు, గుమాస్తాల సంఘం నాయకులు, బొగ్గు ముఠా నాయకులు, మహిళా నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



**వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరల పంపిణీ**

భద్రాద్రి కొత్తగూడెం, ప్రభాత గమనం :

పట్టణంలోని వాసవీ సురక్ష బస్టాండ్ వద్ద మణుగూరు వాసవీ క్లబ్ఆధ్వర్యంలో ఘనంగా 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ దోసపాటి వెంకటేశ్వరరావు జండా ఆవిష్కరించారు. జాతీయ గీతాలను ఆలపించి దేశ స్వాతంత్రం కోసం స్వాతంత్ర సమరయోధులు చేసిన కృషిని గుర్తు చేసుకు న్నారు. ఈ సందర్భంగా నిరుపేదలకు, మున్సిపాలిటీ సిబ్బందికి చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... వాసవీ సురక్ష బస్టాండ్ వద్ద జరిగే కార్యక్రమాలకు పుర ప్రజలు హాజరై వాసవీ క్లబ్ సేవలను గౌరవించడం అభినందనీయం అన్నారు. ఇటీవల మణుగూరు పట్టణంలో ప్రయాణికుల సౌకర్యార్థం సిమెంట్ బల్లలు ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. దాదాపు 20 సంవత్సరాలకి పైగా వాసవి సురక్ష బస్టాండ్ వద్ద వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గణతంత్ర , స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పుర ప్రముఖులు, వర్తక సంఘం అధ్యక్షులు దోసపాటి నాగేశ్వరరావు, మణుగూరు వాసవి క్లబ్ అధ్యక్షుడు శ్యామ్, వాసవి క్లబ్ జిల్లా ప్రతినిధులు బండారు నరసింహారావు, చిత్తలూరి రమేష్, చిట్టూరి శేషు బాబు, దింటకుర్తి బ్రహ్మయ్య, గౌరీ శంకర్, మోహన్ రావు, వేచ్చా చంద్ర శేఖర్, మురహరి, వడియాల ప్రభాకర్ పాల్గొన్నారు.



**మణుగూరులో అబ్కారీ కార్యాలయంలో..**

మణుగూరులో అబ్కారీ కార్యాలయంలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మణుగూరు అబ్కారీ శాఖ సీఐ రాజిరెడ్డి జెండా ఆవిష్కరించారు.అనంతరం మణుగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో పాల్గొన్నారు. ఈసందర్భంగా యువతలో డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి యువత సహకరించేలా ప్రోత్సహించేందుకు విద్యార్థుల మధ్య డ్రగ్స్ మరియు యువత, సమాజంపై వాటి ప్రభావం" అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు.పోటీలో గెలుపొందిన విజేతలకు ఈ వేడుకలో బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆబ్కారీ శాఖ సిబ్బంది,ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



**విప్పల సింగారంలో..**

ప్రభాత గమనం, మణుగూరు : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు విప్పల సింగారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పాల్వంచ రాములు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోరంట్ల కనకయ్య, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ ఐక్యత, సమగ్రతను కాపాడాలని వారు పిలుపునిచ్చారు.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374